క్లుప్తంగా

ఆర్థిక పరిపుష్టి సాధించాలి

పాణ్యం: చెంచు మహిళలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఎంపీపీ ఉసేన్‌బీ అన్నారు. గురువారం మండల కేంద్రం పాణ్యంలోని చెంచుకాలనీలో ఏపీఎం ప్రసాద్ ఆధ్వర్యంలో చెంచు మహిళలకు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ హాజరై ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాయితీలపై అవగాహన కల్పించారు. చెంచుల జీవన ప్రమాణాలు పెంచుకోవడం కోసం ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పొదుపు గ్రూపుల ద్వారా పొట్టేళ్ల పెంపకం, కోళ్ల పెంపకం, చిన్న తరహా పరిశ్రమలు తదితర వాటి ఏర్పాటుకు కల్పిస్తున్న రాయితీలను వివరించారు. కార్యక్రమంలో పొదుపు సంఘం మండల అధ్యక్షురాలు సరళమ్మ, సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

18న మండల సర్వసభ్య సమావేశం

ఓర్వకల్లు: ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు చెప్పారు. కావున అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక పాల్గొనాలని ఆయన సూచించారు.

అంగన్‌వాడీల నిరసన

గూడూరు: తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇతర డిమాండ్లు నెరవేర్చాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ.. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్నా మెనూకు తగిన విధంగా చార్జీలు పెంచాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శివరాముడుకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు రామాంజనమ్మ, రామమ్మ, రత్నమ్మ, కళావతి, సుజాత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

32,125.33 ఎకరాల్లో రీ సర్వే పూర్తి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని గ్రామాల్లో గురువారం నాటికి 32,125.33 ఎకరాల్లో భూముల రీ సర్వే పూర్తయిందని కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు అన్నారు. మండల పరిధిలోని 21 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే పకడ్బందీగా కొనసాగుతోందన్నారు. గ్రామాల్లో చేపడుతున్న రీ సర్వేపై ఎప్పటికప్పుడు వీఆర్‌ఓలు, గ్రామ సర్వే సహాయకులతో సమీక్షిస్తున్నామన్నారు. రైతులకు ముందస్తుగా గ్రామాల్లో దండోరా వేయించి సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ పొలాల్లో వద్ద ఉండి వివరాలను సర్వే బృందాలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.


వైఎస్సార్ బీమాతో ఆర్థిక చేయూత



బీమా సొమ్ము అందజేస్తున్న కార్పొరేటర్

కల్లూరు: వైఎస్సార్ బీమా పథకంతో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కుటుంబాలకు ఆర్థికంగా చేయూతను అందిస్తుందని కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఇటీవల మరణించిన షెక్ షెహరభానుకు వైఎస్సార్ బీమా ఉండటంతో కుటుంబ సభ్యులైన షెక్ యస్మిన్‌కు బీమా సొమ్ము రూ.లక్ష గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు భూపాల్‌రెడ్డి, రాజు, నాయకులు రత్నం, హుస్సేన్ ఆలం, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ మధుకుమార్, వలంటీర్ మహాదేవి పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కె.నాగలాపురంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న దృశ్యం

గూడూరు రూరల్: కె.నాగలాపురంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేపట్టినట్లు గురువారం సర్పంచు నయోమీ తెలిపారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని గ్రామంలోని కాలనీల్లో డ్రైనేజీలు, రోడ్లను శుభ్రం చేయించామన్నారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించడంతోపాటు ఫాగింగ్ చేపట్టినట్లు తెలిపారు. పాడైపోయిన వీధి దీపాలను తీసి వాటి స్థానంలో కొత్త బల్బులను వేశామని, తాగునీటి ట్యాంకులను శుభ్రపరచి నీటిని క్లోరినేషన్ చేయడం జరిగిందని ఆమె వివరించారు.

సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమంత్రి లక్ష్యం

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు
- 'గడప గడప'లో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం కర్నూలు మండలం తులశాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత మూడున్నరేళ్లలో అందించిన సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులకు సంబంధిత బుక్‌లెట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన.. మాట్లాడుతూ కుల, మత, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో సంక్షేమ ఫలాలు ఇంటి ముంగిటకే అందుతున్నాయన్నారు. ఒకే ఒక్క చాన్స్ ఇవ్వండంటూ టీడీపీ మాయగాళ్లు, మోసగాళ్లు మీ వద్దకొస్తే నమ్మొద్దని ప్రజలను కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని చెప్పారు. మనబడి నాడు – నేడు పేరుతో పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారన్నారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే 2024 ఎన్నికల్లో కూడా వైఎస్ జగనే ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ2 నెహెమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, సొసైటీ చైర్మన్ శేషిరెడ్డి, ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, ఏఈఓ మోహన్‌రెడ్డి, వీఆర్‌ఓ రాముడు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



తులశాపురంలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

వైద్య పరీక్షలు

గడివేముల: పేదలకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ తేజస్విని అన్నారు. మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న పలువురిని పరిశీలించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



మంచానికి పరిమితమైన రోగిని పరిశీలిస్తున్న డాక్టర్ తేజస్విని

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

ఓర్వకల్లు: సచివాలయ ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని హుసేనాపురం, సోమయాజులపల్లె గ్రామాల్లోని సచివాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హుసేనాపురం సచివాలయంలో సిబ్బంది పనితీరు, హాజరు పట్టిక, రికార్డులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ఉద్యోగులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించి మరింత చేరువ కావాలన్నారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. జగనన్న కాలనీలకు సంబంధించి ఎన్ని ఇళ్లు కేటాయించారు?.. వాటిలో ఎంత మేరకు పురోగతి సాధించారని హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు విద్యుత్, నీటి వసతి వంటి మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, హై రిస్కు గర్భిణుల పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ సుక్రోజ్, ఐరన్ పోలిక్ మందులు అందించి వారిలో రక్తహీనతను తగ్గించడానికి కృషి చేయాలని సూచించారు. నూతన సచివాలయ భవన నిర్మాణాలు, బియ్యం కార్డుల మంజూరు, వలంటీర్ల హాజరు శాతం, టెస్టిమోనియల్స్, ఆదాయ పత్రాలు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. సోమయాజులపల్లె సచివాలయ పరిధిలో మొత్తం 40 ఇంటి స్థలాలు మంజూరు కాగా, వాటిలో 14 ఇళ్లు పూర్తి అయ్యాయని, మరో 16 బిలో బేస్‌మెంట్ స్థాయిలో, రెండు రూఫ్ కాంక్రీట్ దశలో ఉన్నట్లు హౌసింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

నిర్మాణాలు వేగవంతం చేయండి

పాణ్యం: జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని నియోజకవర్గ హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ నాగరాజు అన్నారు. గురువారం తమ్మరాజుపల్లెలోని గ్రామ సచివాలయంలో లబ్ధిదారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులకు అన్ని రకాలుగా ప్రభుత్వం చేయూత అందిస్తోందని, ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని సూచించారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు.అదేవిధంగా పొదుపు సంఘాల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. హౌసింగ్ ఏఈ నాగశేఖర్ మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరగా గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ నాగశేఖర్

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



ప్రదర్శన ఇస్తున్న కళాజాత బృందం

గూడూరు: స్థానిక ఏపీజీబీ బ్రాంచ్‌లో గురువారం మెప్మా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్, కర్నూలు కళా జాత బృందం వారు అవగాహన కల్పించారు. బ్యాంకు పథకాలు, రుణాలు డిపాజిట్‌లపై ఖాతాదారులకు వివరించారు. డిజిటల్ లావాదేవీలు, సైబర్ మోసాల గురించి మ్యాజిక్ షో ప్రదర్శించారు. సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలపై ఆట పాటల ద్వారా కళాజాత బృందం వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కె.శ్రీనివాసులు, సిబ్బంది వి.కిరణ్ ప్రసాద్, గీతాంజలి, మెప్మా సీఎంఓ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పైబోగులలో తాగునీటి కష్టాలు

గడివేముల: మండల పరిధిలోని ఉండుట్ల గ్రామ పంచాయతీ మజార గ్రామమైన పైబోగులలో గత 20 రోజుల నుంచి తాగునీటి కష్టాలు నెలకొన్నాయి. గ్రామానికి తాగునీరు అందించే బోరు మరమ్మతులకు గురి కావడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీరు సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

కల్లూరు: 44వ జాతీయ రహదారిపై కేవీ సుబ్బారెడ్డి కళాశాల దగ్గర బుధవారం బొలెరో వాహనం బైక్‌ను ఢీకొన్న ఘటనలో కె.వంశీ(21) గాయపడిన విషయం విదితమే. అయితే అతను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ నల్లప్ప తెలిపారు. తల్లి కె.లక్ష్మిదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు...వైఎస్సార్ జిల్లా జమ్ములమడుగు పట్టణానికి చెందిన సుబ్బారెడ్డి, అంకాల్‌రెడ్డితో పాటు డ్రైవర్ కొండయ్యలు కారులో(ఏపీ04ఏఫ్1314) కర్నూల్‌కు వెళ్తుండగా సుగాలిమెట్ట వద్ద ముందు వెళ్తున్న టిప్పర్ సడన్‌గా ఎడమ వైపు తిరిగి కారును ఢీకొంది. ఈ ఘనటలో కారులోని ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులకు 108 వాహనంలో ఈఎన్‌టీ బాలతిమ్మయ్య ప్రథమ చికిత్స అందించి నంద్యాల సమీపంలోని శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలు ఉండటంతో హైవేపై సుమారు అరకిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని దెబ్బతిన్న కారును బయటకు తీసి వాహనాలకు ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

దగ్గరుండి ఆసుపత్రికి పంపిన నంద్యాల ఎమ్మెల్యే :

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కావడంతో నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి సంఘటన స్థలం వద్దకు చేరుకొని గాయపడిన వారితో మాట్లాడి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. దగ్గరుండి 108 వాహనంలో క్షతగాత్రులను ఆస్పత్రికి పంపించారు. ట్రాఫిక్ సమస్య తీరే వరకు ఎమ్మెల్యే అక్కడే ఉన్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు





గాయపడ్డ సుబ్బారెడ్డి, అంకాల్‌రెడ్డి

సర్వే పూర్తి చేయండి

సి.బెళగల్: మండలంలోని ప్రజల వివరాలను గ్రామ వలంటీర్లు ఆయుష్మాన్ భారత్ యాప్‌లో నమోదు చేసి సర్వే పూర్తి చేయాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్‌లోని గ్రామ సచివాలయం- 1ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామ వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ యాప్‌లో వలంటీర్లు తమ కుటుంబ సభ్యుల వివరాలతో పాటు తమ క్లస్టర్ పరిధిలోని ప్రజల వివరాలను తప్పనిసరిగి నమోదు చేయాలని సూచించారు. నూతనంగా మంజూరైన రైస్ కార్డులు లబ్ధిదారుల ఈ- కేవైసీను పూర్తి చేయాలని ఉద్యోగులకు ఆదేశించారు. కాగా గ్రామ పంచాయతీ పరిధిలో త్వరలో చేపట్టనున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఉద్యోగులు, వలంటీర్లు సంసిద్ధులై ఉండాలన్నారు. ఉద్యోగులందరు ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంకాలం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు.

గ్రామాల్లో సమస్యలు తీరేలా...

- 'గడప గడప' సమస్యలు ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం
- బొల్లవరంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వల్ల గ్రామాల్లో సమస్యలు తీరుతున్నాయి. గ్రామ స్థాయిలో సంక్షేమ పథకాల ఎలా అమలవుతున్నాయో తెలుసుకోవడంతో పాటు ప్రజల సమస్యలు విని, వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ ఏడాది మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలైన బొల్లవరం, సల్కాపురం, నెరవాడ, నూతనంగా మున్సిపాలిటీలో కలసిన పెద్దపాడు, ఏ.నాగలాపురంలలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించాలని విజ్ఞప్తి చేయడంతో ఆయన ప్రభుత్వం ప్రతి సచివాలయానికి కేటాయించిన రూ. 20లక్షల నిధులతో వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రాధాన్యత క్రమంలో పనులు:

గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నారు. ఇందుల్లో భాగంగా బొల్లవరం, సల్కాపురం, నెరవాడ, అర్బన్ పరిధిలోని పెద్దపాడు, ఎ.నాగలాపురం ప్రాంతాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. బొల్లవరం సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షలతో గ్రామంలో వివిధ పనులు చేశారు. అందుల్లో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం నుంచి 85 మీటర్ల సీసీ రోడ్డు నిర్మించారు. గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీల్లో రూ.5 లక్షలతో డ్రైనేజీల పనులు, మరో రూ.5లక్షలతో గ్రామం నుంచి పొలాలకు వెళ్లే దారి, కె.నాగలాపుం, బుడిదపాడుకు వెళ్లే రోడ్డులో కల్వర్టు నిర్మించారు. సల్కాపురంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అర్బన్ పరిధిలోని పెద్దపాడు, ఎ.నాగలాపురంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు త్వరలోనే ప్రారంభించనున్నారు. గ్రామాల్లో సమస్యలు తీరుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పొలాలకు వెళ్లే దారిలో నిర్మించిన కల్వర్టు



గతంలో రోడ్డు దుస్థితి

నాణ్యతగా పనులు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన గ్రామాల్లో సచివాలయాని రూ.20 లక్షల చొప్పున ఇప్పటి వరకు మూడు సచివాలయాలకు రూ. 60 లక్షలు నిధులు మంజూరయ్యాయి. అందుల్లో బొల్లవరం గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టు పనులు పూర్తి చేశాం. నెరవాడలో డ్రైనేజీ కాలువల పనులు పూర్తయ్యాయి. పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాం. –అచ్యుతానందరెడ్డి, పంచాయతీరాజ్, ఏఈ, కల్లూరు

సమస్య పరిష్కారం



మా గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన తరువాత రూ.26 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయి. ఎస్సీ, బీసీ కాలనీలలో డ్రైనేజీ కాలువలు నిర్మించారు. దీంతో కాలువల సమస్య పరిష్కారం అయ్యింది. అలాగే కె.నాగలాపురం, బుడిదపాడు గ్రామాల దారిలో కల్వర్టు నిర్మాణం పూర్తయింది. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చొరవతోనే సమస్యలు పరిష్కరమయ్యాయి. – చాంద్ బాష, బొల్లవరం

పెరటి కోళ్లతో జీవనోపాధి

- పొదుపు మహిళలకు కోళ్ల యూనిట్ల పంపిణీ
- గుడ్లు, మాంసం విక్రయంతో అదనపు ఆదాయం



పాలకల్లులో పెరటి జాతి కోళ్లు

కోడుమూరు: పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే పెరటి కోళ్ల పంపిణీ చేసి వారికి జీవనోపాధి కల్పిస్తోంది. ఇంటి ఆవరణలోని కోళ్లను పెంచుకొని అదనపు ఆదాయం వచ్చే విధంగా ప్రోత్సహిస్తోంది. ఇవి రెండు నెలలకే గుడ్లు పెడుతాయి. పెరటికోడి నాటుకోడి మాదిరిగానే గరిష్టంగా రెండు కిలోల వరకు పెరుగుతోంది. మాంసంతోపాటు గుడ్లను అమ్ముకొని మహిళలు ఆదాయం పొందుతున్నారు.

ఒక్కో యూనిట్‌లో 8 కోడిపెట్టెలు, 3 పుంజులు :

పెరటి అనే జాతి కోళ్లను డీఆర్‌డీఏ అధికారులు ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా పొదుపు మహిళలకు సరఫరా చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతానికి చెందిన పెరటి కోళ్లపై శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపిన అనంతరం అన్ని వయస్సుల వారు ఈ కోడి మాంసం తినవచ్చని ధ్రువీకరించారు. పెరటి కోడి పెట్టే గుడ్లలో ప్యాట్ 113.25 ఎంజీ, ఐరెన్ 4.25 మిల్లి గ్రాములు ఉంటుంది. నియోజకవర్గంలోని కోడుమూరు మండలంలో 46 యూనిట్లు, గూడూరులో 40 యూనిట్లు, సి.బెళగల్‌లో 37 యూనిట్లు పొదుపు మహిళలకు అందజేశారు. ఒక్కో యూనిట్‌లో 8 కోడిపెట్టెలు, 3 పుంజులను రూ.3,150లకు అందజేస్తారు. కోళ్ల కొనుగోలు చేసిన మహిళలకు మూడు రకాల మందులను అందజేస్తారు. 15 రోజుల్లో కోడి పిల్లలు చనిపోతే వాటి స్థానంలో తిరిగి కోడిపిల్లలను ఏజెన్సీ సరఫరా చేస్తుంది. కోడిపిల్లలను పెంచుకునేందుకు పొదుపు సంఘం పొదుపు నిధి నుంచి, స్త్రీ నిధి నుంచి ఆర్థిక సహకారం అందుతుంది. ప్రతినెల వాయిదాల పద్ధతిలో పొదుపు మహిళలు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో మహిళ ఎన్ని యూనిట్లైనా పెంచుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తోంది.

కోడి గుడ్లు అమ్ముతున్నా



స్త్రీనిధి ద్వారా అప్పు తీసుకొని కోళ్ల కొనుగోలు చేశా. రెండు నెలలకే కోళ్లు గుడ్లు పెడుతున్నాయి. నాటుకోడి గుడ్డు ధర మాదిరిగానే ఈ కోడి గుడ్డును అమ్ముతున్నా. కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం వస్తోంది. ప్రత్యేకంగా కోళ్ల పెంపకానికి సమయం కేటాయించాల్సిన అవసరం లేదు. ఇంటి ఆవరణలోనే పెంచుతున్నాం. రెండు యూనిట్ల కోళ్లను తెచ్చుకున్నా. ఒక్కో కోడి రెండు కేజీల వరకు ఉన్నాయి. – రాములమ్మ, పొదుపు మహిళ

అడిగిన వారందరికీ సరఫరా



పెరటి జాతి కోళ్లను ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా సరఫరా చేస్తున్నాం. సి.బెళగల్ మండలానికి 200 యూనిట్లు పంపిణీ చేయాలని అధికారులు టార్గెట్ పెట్టారు. అడిగినవారందరికీ కోళ్లను సరఫరా చేసి మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తాం. పెరటి జాతి కోళ్లకు వైరస్ ఒడుదుడుకులుండవు. అన్ని ప్రాంతాల వాతావరణాన్ని తట్టుకొని జీవించే శక్తి ఈ కోళ్లకు ఉంది. –వెంకటస్వామి, ఏపీఎం, సి.బెళగల్

ఆధార్ కేంద్రానికి విశేష స్పందన

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని చెంచుకాలనీ గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో గురువారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రానికి విశేష స్పందన వచ్చింది. ఈ కేంద్రాన్ని ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంత కాలంగా చెంచులకు ఆధార్ కార్డు లేకపోవడంతో సంక్షేమ పథకాలు అందక, పిల్లలను బడులకు పంపలేని పరిస్థితి నెలకొందన్నారు. ఆధార్ లేకపోవడం కారణంగానే వారు కొండల్లో జీవనం సాగిస్తున్నారన్నారు. కాలనీలో ప్రతి ఒక్కరికీ ఆధార్ ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు 200మందికి పైగా ఆధార్ కేంద్రానికి వినియోగించుకున్నారు. ఎంపీడీఓ దస్తగిరి ఆధార్ కేంద్రాన్ని పలుమార్లు పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవి

ప్రతి రోజూ 'స్పందన' నిర్వహించాలి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు 'స్పందన' కార్యక్రమం తప్పకుండా నిర్వహించాలని కర్నూలు డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి అన్నారు. గురువారం కర్నూలు మండలం పసుపులలో 1, 2 గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ కింద ఇంటింటి సర్వే పూర్తి చేయాలన్నారు. అలాగే బియ్యం కార్డుదారులకు ఈకేవైసీ పూర్తి చేసి, జగనన్న తోడు లబ్ధిదారులకు ఈకేవైసీ చేయించాలని సూచించారు. కల్యాణమస్తు పథకం గురించి వలంటీర్లు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది క్రమం తప్పకుడా ప్రతి రోజూ బయోమెట్రిక్ హాజరు వేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి హేమంత్‌కుమార్‌రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పసుపులలో గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో మాట్లాడుతున్న కర్నూలు డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి